# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా నాగాలాండ్ ప్రజలకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.
- ప్రపంచానికి హెచ్ఐవీ మందులను సరఫరా చేయడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణలో భారత్ ముందంజలో ఉందనికేంద్రమంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు.
- సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం.
- సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ మూడు టైటిల్స్ సాధించింది.

======================

నాగాలాండ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఈరోజు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి ఆ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వృక్ష, జంతుజాలంతో సంపన్నమైన వారసత్వాన్ని కలిగిన నాగాలాండ్ రాష్ట్రం ధైర్యసాహసాలకు కూడా ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పేర్కొన్నారు. వివిధ రంగాలలో నాగాలాండ్ సాధించిన ప్రగతి ప్రశంసనీయమని అన్నారు. శాంతియుత, సంపన్నమైన ప్రగతిశీల భవిష్యత్తు ను కలిగి ఉండాలని ఆమె రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సహజ వైభవం, శక్తివంతమైన సంస్కృతి, ప్రకృతితో మమేకమై ఆకర్షణీయంగా వెలుగొందుతున్న నాగాలాండ్ రాష్ట్రం భారతదేశ సాంస్కృతిక పర్యావరణ సంపదగా అభివృద్ధి చెందుతోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. అన్ని రంగాలల్లోనూ నాగాలాండ్ అభివృద్ధి, శ్రేయస్సును సాధించాలని ఆయన ఆకాంక్షించారు. నాగాలాండ్ సంస్కృతి కర్తవ్య స్ఫూర్తి, కరుణకు ప్రసిద్ధి చెందిందని సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రం నిరంతరం అభివృద్ధి చెందాలని ప్రధానమంత్రి అన్నారు.

======================

ప్రపంచానికి హెచ్ఐవీ మందులను సరఫరా చేయడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణలో భారత్ ముందంజలో ఉందనికేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా పేర్కొన్నారు. ఈరోజు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల మానవత్వం చూపాలని, అలాగే వారి మానవ హక్కులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఐవి రక్షణ చట్టం 2017 ద్వారా వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చికిత్సా విధానాల ఫలితంగా దేశంలో ఎయిడ్స్ మరణాలు 79 శాతం తగ్గాయని, అలాగే కొత్త ఇన్ఫెక్షన్లలో 44 శాతం తగ్గింపు ఉందని అన్నారు. ఈ వ్యాధికి అత్యంత ప్రభావవంతమైన ఔషధాన్ని తయారు చేయడంలో భారతదేశం విజయం సాధించిందని అన్నారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత భారతదేశంగా రూపుదిద్దుకుంటుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భువనేశ్వర్‌లో జరుగుతున్న అఖిల భారత డైరెక్టర్ జనరల్స్, ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ కాన్ఫరెన్స్ చివరి రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన దేశంలోని భద్రతా సంబంధిత సమస్యలపై చర్చలు జరుపుతున్నారు. సైబర్ క్రైమ్, తీర ప్రాంత భద్రత, మావోయిస్టుల తిరుగుబాటును ఎదుర్కోవడంపై ప్రధానంగా చర్చిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్‌ల వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల ద్వారా ఎదురవుతున్న సవాళ్లతో సహా విభిన్న జాతీయ భద్రత, సంబంధిత సమస్యలను ఎదుర్కోవడంలో వ్యూహాత్మక మార్గాన్ని నిర్ణయించడంపై ఈ సమావేశం దృష్టి సారిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకొంటున్నాం. భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో 1965 డిసెంబర్ 1వ తేదీన సరిహద్దు భద్రతాదళం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనికులు కనబరుస్తున్న ధైర్యసాహసాలను గుర్తు చేసుకుంటూ.. దేశవ్యాప్తంగా ఈ రోజు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరిహద్దు భద్రతా దళం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ధైర్యం, అంకితభావం, అసాధారణమైన సేవలను అందిస్తున్న BSF కీలక రక్షణ రేఖగా నిలుస్తుందని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. వారి అప్రమత్తత, ధైర్యం దేశ భద్రతకు దోహదపడుతుందని అన్నారు. బీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సరిహద్దు భద్రతా దళం సిబ్బంది, వారి కుటుంబాలకు సామాజిక మాధ్యమం వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. BSF సైనికులు దృఢ సంకల్పంతో దేశ గౌరవాన్ని, ఆశయాలను కాపాడారని, దాని కోసం తమ ప్రాణాలను సైతం అర్పించడానికి ఎన్నడూ వెనుకడుగు వేయలేదని అన్నారు. వారి శౌర్యం, త్యాగాలతో భారతదేశం ఎప్పటికీ వర్ధిల్లుతూనే ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త రాజా మహేంద్ర ప్రతాప్ దౌత్యవేత్త, రాజనీతిజ్ఞుడు, దార్శనికుడు అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. రాజామహేంద్ర ప్రతాప్ 138వ జయంతి సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలోని భారత మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయవాదం, దేశభక్తి, దూరదృష్టికి రాజా మహేంద్ర ప్రతాప్ ఉదాహరణగా నిలిచారని అన్నారు. రాజా మహేంద్ర ప్రతాప్ వంటి ఎందరో వీరుల త్యాగాలపై దేశ స్వాతంత్ర్యానికి పునాదులు నిర్మించబడ్డాయని పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్‌కు మూడు టైటిల్స్ లభించాయి. లఖ్‌నవూ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ జోడీ చైనాకు చెందిన బావో లి జింగ్, లీ కియాన్ ద్వయంపై విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు చైనాకు చెందిన వులు యు పై గెలుపొందింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జేసన్ తే పై ఫైనల్స్‌లో విజయం సాధించాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కొత్త ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జైషా మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానుల ఆకాంక్షలకు అనుగుణంగా క్రికెట్ మరింత మందికి అందుబాటులోకి తీసుకురావాలనేది తన లక్ష్యమని అన్నారు. క్రికెట్ అనేది ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ఏకం చేసే క్రీడ అని ఆయన అన్నారు. తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. కాగా రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైన అతిపిన్న వయస్కుడిగా జై షా గుర్తింపు దక్కించుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా - ఉక్రెయిన్ దేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి. డొనెట్స్క్ ప్రాంతంలోని ఇలింకా, పెట్రోవాకా స్థావరాలను రష్యా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఈరోజు వెల్లడించింది. గత రాత్రి, రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు 29 ఉక్రేనియన్ మానవరహిత వైమానిక వాహనాలను అడ్డగించి ధ్వంసం చేశాయని ఆ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ... 30కి పైగా రష్యన్ అటాక్ డ్రోన్‌లను రాత్రిపూట కాల్చివేసినట్లు తెలిపారు. రష్యా గతంలో ఉక్రెయిన్‌పై 500 కంటే ఎక్కువ గైడెడ్ ఏరియల్ బాంబులు, దాదాపు 660 అటాక్ డ్రోన్‌లు, వివిధ రకాల 120 క్షిపణులను ప్రయోగించిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో వస్తు సేవల పన్ను (జిఎస్టీ) వసూళ్లు మరోసారి గణనీయ స్థాయిలో నమోదయ్యాయి. నవంబర్ మాసంలో 1.82 లక్షల కోట్ల రూపాయలు వసూలయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో సీజీఎస్టీ రూపంలో 34 వేల 141 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూపంలో 42 వేల 047 కోట్లు, ఐజీఎస్టీ రూపంలో 91 వేల 828 కోట్లు సమకూరాయని, సెస్సుల రూపంలో మరో 13 వేల 253 కోట్ల రూపాయలు వచ్చాయని ఆ శాఖ వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ వసూళ్లు 8.5 శాతం పెరిగినట్లు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =